
# అమ్మ మనసు

**గుడిసెలోని కుక్కిమంచం మీద కూర్చుని ఉంది 30 ఏళ్ళ గంగ. ఇంకో మంచంమీద పడుకొని దగ్గుతున్నాడు ఓబుకేశు గంగ భర్త. గంగ చేతిలో వంద రూపాయల నోట్లు. వాటిని చూస్తున్నకొద్దీ గంగ కళ్ళలో ఉబుకుతున్నాయి నీళ్ళు.**

హాస్పటల్లో ఎవరో అన్న మాటలు గంగ చెవిలో గింగుర్లు తిరుగుతున్నాయి.

"లేబర్ మనుషులు. వాళ్ళకు మమకారం ఉండదు"

నిజమేనా! తనకు మమకారం లేదా? మనసుకు కూడా లేబర్ తనముందా? తానా నిర్ణయం తీసుకోవటానికి ఎంత మథనపడింది? ఎవరికోసం ఈ పని చేసింది? గంగ మనసు మనసులో లేదు. వాళ్ళు అన్నారని కాదు. గంగ మనసు కూడా ఒప్పుకోవటం లేదు. తాను చేసింది ఘోరమైన తప్పు. కన్నీళ్ళు ధారగా కారుతున్నాయి. అలవాటుగా




దానం ఉమాదేవి

మంచంమీద చేయ్యేసి జోకొట్టబోయింది. చేతికి ఏమీ తగలలేదు. అప్పుడు గుర్తొచ్చింది తాను చేసిన పని. పెద్దగా ఏడవటం మొదలుపెట్టింది గంగ. ఆ ఏడుపుకు ఓబులేశు ఇటు తిరిగి చూశాడు. గంగ బాధకు కారణం అతడికి తెలుసు.

"ఊరుకో" అన్నాడు. అన్నాడేగానీ అతడికీ బాధగానే ఉంది.

రాత్రి జరిగినదంతా అతడి కళ్ళ ముందు కదలాడుతూనే ఉంది.

ఓబులేశుకు ఎన్ని రోజులైనా జ్వరం తగ్గకపోతే హాస్పటల్‌కు తీసుకుపోయింది గంగ. క్షయ ముదిరిందని మందులు వాడాలని పోషకాహారం పెట్టాలని చెప్పారు డాక్టర్లు. గవర్నమెంటు హాస్పటలే అయినా కొన్ని మందులు తమవద్ద లేవని బయట కొనుక్కోమని చెప్పారు. నెల రోజుల్నుండి రిక్షా వేయటం లేదు ఓబులేశు. గంగ ఒక మిల్లులో పని చేస్తోంది. ఆ మిల్లు కూడా నష్టాలతో కూరుకుపోయి పది రోజుల్నుండి మూతపడి ఉంది. ఇప్పట్లో మిల్లు నడిచే సూచనలు లేవు. చిల్లర కొట్లో అప్పు. ఆ షాపువాడు కనబడ్డప్పుడల్లా అప్పు చెల్లించమని తిడుతున్నాడు. మందులు కొనటానికి డబ్బు లేదు. కాలి పట్టాలు నెల కిందటే అమ్మేసింది గంగ. రెండు రోజుల నుండి అందరూ పస్తే. ఓబులేశు, గంగకు ఎనిమిది నెలల బాబు ఉన్నాడు. సరైన తిండి లేక గంగ పాలు బాబుకు సరిపోవటం లేదు. పాలు కొని పోసే స్తోమత లేదు. రెండు రోజుల నుండి ఇంట్లో తిండి గింజలు లేవు. పక్క గుడిసెవాళ్ళను అడిగి నిన్న ఒక ముద్ద అన్నం బాబుకు పెట్టింది గంగ. గంగకు కూడా రెండు రోజుల నుండి జ్వరం, మలేరియా అన్నారు. ఆ మాత్రలు వేసుకుంటే ఒకటే తిప్పటం. ఏమీ తినబుద్ధకావటం లేదు. తినటానికి ఏమీ లేదు కూడా. రాత్రికి బాబుకు కూడా వొళ్ళు వెచ్చబడేటప్పటికి కంగారు పడింది గంగ. జ్వరం వచ్చిన తన దగ్గర పాలు తాగితే జ్వరం రాదు మరి. పాలు ఇవ్వకపోతే వాడి కడుపు ఎలా నింపాలి. జ్వరం తగ్గిన తరువాత ఏదైనా కూలిపనికి వెళదామన్నా అసలు ఎక్కడా పనులే లేవు. చేయటానికి పని లేక, తినటానికి తిండి లేక, ఈ రోగాలతో ఇలా బ్రతకాల్సిందేనా? బాబు అంటే గంగకు ఎంతో ప్రేమ. వాడి కడుపు కూడా సరిగా నింపలేకపోతున్నాం. తిండి సరిగా లేక, వాడికి కూడా క్షయ సోకి ఏ మందులు వాడలేక పోషకాహారం లేక వాడు చనిపోతాడేమోననే భయం పట్టుకుంది గంగకు. అందుకే ఒక నిర్ణయానికి వచ్చింది. వాడు ఎక్కడ ఉన్నా తిండికి

లోటు లేని చోట ఉండాలి అనుకున్నది. తన నిర్ణయాన్ని ఓబులేశుకు చెప్పి ఒప్పించింది. హాస్పటల్‌లోనే నిర్ణయం తీసుకుంది.

"అయ్యా! మా అబ్బాయిని ఎవరైనా పెంచు కుంటారా?" అడిగింది గంగ అటుగా వెళ్తున్న ఓ వ్యక్తిని. అలా కొంతమందిని అడిగింది. అక్కడే హాస్పటల్‌లో ఉన్న పిల్లలు లేని జంటకు ఈ విషయం తెలిసింది. వాళ్ళు వచ్చారు.

"ఎందుకు అమ్ముతున్నావు? ఎంతమంది పిల్లలు నీకు?" అంటూ ప్రశ్నించారు.

"ఒక్కడేనయ్యా" అంటూ తన పరిస్థితిని చెప్పింది.

"సరే ఎంతకిస్తావు?" అడిగారు.

మనస్సు కలుక్కుమంది గంగకు. రక్తం పంచుకు పుట్టిన బిడ్డను వెలకట్టి అమ్మడం తనకేమన్నా వ్యాపారమా? తాను వెల కట్టేది బిడ్డకు కాదు మాతృత్వానికి.

"డబ్బు వద్దయ్యా. నా బిడ్డ ఎక్కడో ఒకచోట తిండికి లోటు లేకుండా బతికితే చాలు. నా దగ్గరుంటే సరియైన తిండి లేక, ఏ అంటురోగాలో వచ్చి ఎంతో కాలం బతకడు. వాడు ఎక్కడో ఒక చోట బతికితే చాలు" కన్నీళ్ళతో చెప్పింది గంగ.

గంగ వద్దన్నా వాళ్ళు గంగ చేతిలోమూడు వేల రూపాయలు పెట్టి బిడ్డను తీసుకొని వెళ్ళారు. ఇంటికి వచ్చేటప్పుడు కొంత డబ్బు పెట్టి ఓబులేశుకు మందులు కొన్నది. పండ్లు కొన్నది. దారిలో ఉన్న పచారికొట్లో అప్పు తీర్చేసి కొన్ని సరుకులు కొని ఇంటికి వచ్చారు గంగ, ఓబులేశు. రెండు రోజుల నుండి తిండి లేదు ముందు అన్నం వండాలి అనుకొని అన్నం వండి ఓబులేశుకు పెట్టింది. కొద్దిగా ఎంగిలి చేసి లేచాడు.

తాను కంచంలో అన్నం పెట్టుకుంది గంగ. పచ్చడి కలిపిన మెతుకులు. ఎర్రగా తన కొడుకు రక్తాన్ని కలిపి తింటున్నట్లుగా అనిపించింది గంగకు. ఇంట్లో అడుగు పెట్టగానే పాక్కుంటూ వచ్చి కాళ్ళు చుట్టుకునే కొడుకు లేకపోతే ఏమిటోగా ఉంది మనసు. అన్నంలో చెయ్యి కడిగి మంచం ఎక్కింది గంగ. రాత్రి నుండి ఒకటే ఏడుపు. తెల్లవార్లూ నిద్రపోలేదు. ఆకలికి మాడి చావకుండా ఎక్కడైనా సరే బతికితే చాలని పిల్లవాడిని ఇచ్చిందే కానీ సమాధానపడలేకపోతున్నది. మళ్ళీ జీవితంలో వాడిని చూస్తానా లేదా అని ఆలోచించసాగింది. తాను తొందరపడిందేమో? అడుక్కుని అయినా బ్రతకొచ్చు కదా!కట్టుబట్ట కూడా లేని ముష్టివాళ్ళు కూడా తమ బిడ్డను తమతోనే ఉంచుకుంటారు కదా! తన బిడ్డ తన కోసం ఏడిస్తే? వాళ్ళకు అలవాటు పడేదాకా వాడు తన కోసం బెంగ పెట్టుకుని ఏమీ తినడేమో? తాము మాత్రం వాడి వల్ల వచ్చిన డబ్బుతో సరుకులు కొనుక్కున్నారు. కనీసం వాడిని ఎప్పుడైనా చూడటానికి వీలుగా వాళ్ళ అడ్రస్ కూడా తీసుకోలేదు. ఏడ్చి ఏడ్చి అలసిపోయింది. ఏమైనాసరే తన బిడ్డ లేకుండా తాను బ్రతకలేదు. వెళ్ళి జరిగినదానికి వాళ్ళకు క్షమాపణ చెప్పి తన బిడ్డను తాను తెచ్చుకోవాలి.



ప్రముఖ రచయిత, కెనరా బ్యాంక్ ఆఫీసరు శ్రీ పోపూరి విశ్వనాథ్ చెన్నై నుంచి బదిలీ అయిన సందర్భంగా 'జనని' సాంస్కృతిక సంస్థ వీడ్కోలు సభ నిర్వహించింది. ఈ సభలో పాత్రికేయులు శ్రీ బి.ఎస్.ఆర్. కృష్ణ శ్రీ పోపూరికి అభినందన పత్రం సమర్పించారు. జనని అధ్యక్షురాలు శ్రీమతి నిర్మలా పళనివేలు, కార్యదర్శి శ్రీ చెన్నయ్యలను చిత్రంలో చూడవచ్చు. కార్యక్రమంలో పాల్గొన్న వారిలో శ్రీ ఎస్. దశరథరామిరెడ్డి, శ్రీ బషీర్‌గారితోపాటు అనేకమంది ప్రముఖులు ఉన్నారు.

ఆయుష్షు ఉంటే వాడే బతుకుతాడు. ఒక నిర్ణయానికి వచ్చింది గంగ.

"వాళ్ళు తిరిగి బాబును ఇస్తారో? లేదో? " అన్నాడు ఓబులేశు.

"ఎందుకియ్యరు? వాడు మన బాబు" అన్నది గంగ. పైకి అలా అన్నాదే కాని లోపల మాత్రం సందేహంగానే వున్నది. గబగబా హాస్పిటల్ దగ్గరకు వెళ్ళింది. హాస్పిటల్ అంతా వాళ్ళ కోసం కలియ తిరిగింది ఎక్కడా కనపడలేదు. అక్కడున్న వాళ్ళని అడిగింది. మాకు తెలియదన్నారు. నర్సును అడిగింది. నర్సు చెప్పిన సమాధానం విని కూలబడిపోయింది. వాళ్ళది ఆ వూరు కాదు. ఆ వూరి మీదుగా వాళ్ళ ఊరు వెళుతున్నారు. ఆడ మనిషికి ఉన్నట్లుండి సుస్తీ చేస్తే బస్సు దిగి అప్పూట హాస్పిటల్‌లో చూపించుకొని వెంటనే తిరుగు ప్రయాణమయ్యారు. గంగకు ఏం చేయాలో పాలు పోవటం లేదు. ఎక్కడని వెతకాలి? తనంతటి నికృష్టమైన తల్లి ఎక్కడా ఉండకూడదు. తనకు జీవితాంతము రంపపు కోతే. కన్నీళ్ళతో నిండిపోయిన కళ్ళకు ఏమీ కనిపించటం లేదు.

"నిన్న అమ్మింది. డబ్బంతా ఖర్చు పెట్టుకొని ఈ రోజు పిల్లవాడి కోసం వచ్చింది. ఛీ" అన్నది ఒకామె.

ఏదీ గంగకు వినిపించడం లేదు. చిన్నగా రోడ్డు మీదకి వచ్చింది. ఇంటికి ఎలా వచ్చిందో గంగకే తెలియదు. కొన్ని రోజులపాటు మామూలు మనిషి కాలేకపోయింది. పిల్లవాడిని ఎంతగా మరిచిపోవాలనుకున్నా పదేపదే కళ్ళ ముందు కదలాడసాగాడు. ఓబులేశు ఎంతగానో ఓదార్చాడు. "కొంతకాలం ఆగి నాకు ఈ జబ్బు తగ్గిన తరువాత మళ్ళీ పిల్లల్ని కందాం" అన్నాడు ఓబులేశు.

"నాకు తల్లి అయ్యే అర్హత లేదు. నేను ఎప్పటికీ తల్లిని కాను" స్థిర నిర్ణయంతో చెప్పింది గంగ. మళ్ళీ ఇంకో బిడ్డ పుట్టినా తాను ఏదైనా అనాలోచిత నిర్ణయం తీసుకోదని నమ్మకం ఏమిటి? బోసి నవ్వులు నవ్వే బిడ్డను స్వయంగా ఇంకొకరి చేతుల్లో పెట్టింది. మాతృత్వపు విలువ తెలియని తాను గొడ్రాలికిందే లెక్క" అని నిర్ణయించుకుంది గంగ.

ఓబులేశును ఒక సంవత్సరంపాటు రిక్షా తొక్కొద్దు అని చెప్పింది. నాలుగిళ్ళలో పాచి పనులకు కుదిరింది. ఒక రోజు ఏదో పనిమీద బజారుకు పోయి వస్తుంటే ఒకింట్లో చాలామంది పిల్లలు కనిపించారు. చిన్నచిన్న పిల్లలు కూడా ఉన్నారు. ఆ ఇంటి దగ్గరకు వెళ్ళింది. బయట గేటు వేసి ఉంది. లోపలకు తొంగి చూసింది. లోపల నుండి ఒక ఆడమనిషి బయటకు వచ్చి ఏం కావాలి అని అడిగింది. అక్కడ వివరాలు అడిగింది గంగ. అది ఒక అనాథశరణాలయం అని తెలుసుకుంది. ఆ పిల్లలలో కొంతమంది ఏడుస్తున్నారు. వాళ్ళను చూస్తుంటే తన కొడుకే గుర్తుకు వస్తున్నాడు.

"రోజూ నేను కాసేపు ఈ పిల్లలతో గడపొచ్చా?" అడిగింది గంగ.

"నీకు పిల్లలు లేరా? ఒకళ్ళని పెంచుకుంటావా?" అడిగింది ఆ స్త్రీ.

"ఎవర్నీ పెంచుకోనని రోజూ కాసేపు పిల్లలతో గడుపుతానని తనకు ఏమీ ఇవ్వాల్సిన పనిలేదని" చెప్పింది గంగ. ఆ స్త్రీ అక్కడి పిల్లల సంరక్షణ చూసే ఆయా. ఆమె ఒక్కతే అవటం వల్ల పిల్లల ఆలనా పాలనా కష్టమైపోతున్నది. అందుకని ఆమె వెంటనే లోపలకు వెళ్ళి వార్డెనును పిలిచి విషయం చెప్పింది.

"డబ్బులు తీసుకోకుండా వీళ్ళను ఎందుకు

**(మిగతా 30వ పేజీలో చూడండి)**

# అమ్మ మనసు (కథ)

(27వ పేజీ తరువాయి)

ఆడిస్తుంది? అసలు ఆమె ఎవరో, ఎవరినైనా పిల్లల్ని మచ్చిక చేసుకొని బయటకు తీసుకెళ్ళి అమ్ముకుంటుందో ఏమో?" అన్నాడు వార్డెను.

"ఆమెను చూస్తే అలా కనిపించటం లేదు. అయినా నేను పక్కన ఉంటాగా?" అన్నది ఆయా. సరేనన్నాడు వార్డెను. ఆ రోజు నుండి రోజూ సాయంత్రం ఓ రెండు గంటలపాటు అనాథశరణాలయంలోని పిల్లల ఆలనా పాలనా చూసుకుంటూ గడపసాగింది గంగ. ఆయమ్మా అంటూ తనను పిలుస్తున్న పిల్లలతో అమ్మా అని పిలవమని చెప్పింది. బట్టలు తడుపుకుని పాడు చేసుకున్న పిల్లల్ని అసహ్యించుకోకుండా వాళ్ళకు బట్టలు మార్చడం పెద్ద పిల్లలకు కథలు చెప్పటం చేసేది. రోజూ గంగ రాక కోసం పిల్లలందరూ ఎదురు చూసేవాళ్ళు. గంగను చూడగానే వాళ్ళ కళ్ళలో ఎంత సంతోషమో. అమ్మొచ్చింది. అమ్మొచ్చింది. అంటూ పరుగెత్తుకుంటూ వచ్చేవాళ్ళు. మీకు అమ్మలేదని దేవుడు నన్ను పంపించాడని చెప్పేది. పిల్లలు ఒకరితో ఒకరు పోట్లాడుకుంటే తప్పని అన్నదమ్ములు కొట్టుకోకూడదనీ చెప్పేది. తమకన్నా చిన్నవారిని ఆడించాలి కాని పోట్లాడకూడదు అని చెప్పేది. అందర్నీ సమానంగా ముద్దాడుతూ ఉండేది. గంగ చంకలో ఎప్పుడూ ఎవరో ఒక చంటిబిడ్డ ఉండాల్సిందే. ఎప్పుడైనా వార్డెను కొంత డబ్బు ఇవ్వబోయినా తీసుకునేది కాదు. ఇప్పుడు గంగ మనసులో బాధ లేదు. దేవుడు ఒక్క బిడ్డను దూరం చేసి ఇంతమంది బిడ్డలను ఇచ్చాడని భావించేది. సంవత్సరం పైన అయింది గంగకు ఆ ఆశ్రమంలో అనుబంధం పెరిగి.

ఆ రోజు తాను పనిచేసే ఇంటామెకు ఆమె కూతురు చీర తెచ్చింది. ఆ రోజు ఏదో అమ్మ రోజట. ఆ రోజు వార్డెను ఉదయం పదింటికల్లా ఆశ్రమానికి రమ్మన్నాడు. ఎవరో ఆఫీసర్ వస్తాడు. కాస్త సాయం ఉండాలి రమ్మన్నాడు. త్వరగా అన్ని ఇళ్ళల్లో పనులు ముగించి ఇంటికి వచ్చి వంట చేసిపెట్టి ఆశ్రమానికి బయలుదేరింది. గంగ వెళ్ళేటప్పటికే ఆశ్రమం అంతా అలంకరించి ఉంది. ఆశ్రమం ముందు ఉన్న ఖాళీ జాగాలో ఒక వేదిక ఏర్పాటు చేశారు. పిల్లలు ఆశ్రమంలోని పూలచెట్ల నుండి పూలు కోసి ఒకచోట పోశారు. ఎవరో అధికారులు వచ్చినట్టున్నారు. బయట కొన్ని కార్లు ఉన్నాయి. గంగ ఆశ్రమంలో అడుగు పెట్టగానే అమ్మ వచ్చింది అమ్మ వచ్చింది అంటూ పిల్లలు అరుచు కుంటూ గంగను చుట్టుముట్టారు. గంగ వాళ్ళకు వరుసగా ముద్దులు పెట్టసాగింది. ఈ గొడవకు వార్డెన్‌తో మాట్లాడుతున్న ఆ అధికారి తల తిప్పి గంగవైపు చూశాడు. చిన్న వయసే అనుకున్నాడు. నేను చెప్పింది ఆమెను గురించే సార్ అన్నాడు వార్డెన్.

"గంగా" పిలిచాడు వార్డెన్. దగ్గరకు వెళ్ళింది గంగ.

"ఈయన ఈ ఆశ్రమం వ్యవహారాలు చూసే ఆఫీసర్‌గారు" అన్నాడు వార్డెన్. నమస్కారం చేసి ఇవతలకు వచ్చింది గంగ.

సభ మొదలైంది. ఊళ్ళోని ప్రముఖులు అందరూ వచ్చారు. పిల్లలందరూ కింద నేలమీద పరచిన పట్టామీద కూర్చున్నారు. పిల్లల మధ్య గంగ కూడా కూర్చుని ఉంది. ఒడిలో సంవత్సరం బాబు ఉన్నాడు.

"ఈ రోజు మదర్స్ డే. ఈ సందర్భంగా ఆశ్రమంలోని పిల్లల కోరిక మేరకు ఒక అమ్మను సన్మానించాలని నిర్ణయించుకున్నాము. ఆశ్రమంలోని పిల్లలందరిచేత అమ్మగా పిలవబడుతున్న గంగను వేదిక మీదికి రావాల్సిందిగా కోరుతున్నాము"

గంగ అలాగే కూర్చున్నది. తనకు సన్మానమా? ఎందుకు కన్న బిడ్డను అమ్ముకొన్నందుకా? పిల్లల్ని కని వాళ్ళను కంటికి రెప్పలా కాపాడి పెంచి ప్రయోజకుల్నిచేసిన తల్లులను సన్మానించాలి. తనలాంటి వారిని సన్మానించాల్సింది ఈ రోజు కాదు, కసాయి దినం అని పేరు పెట్టి తనలాంటి వాళ్ళను పది మంది ఎదుట ఛీ కొట్టాలి.

"గంగా లే" అన్నాడు వార్డెను. ఆయమ్మ కూడా గంగను లేవమని చెయ్యి అందించింది.

"మీకు నా గురించి తెలియదు. ఈ సన్మానం నాలాంటివాళ్ళకు కాదు. నా గురించి తెలిస్తే ఆశ్రమంలో కూడా ఉండనివ్వరు" కన్నీళ్ళతో చెప్పింది గంగ.

వార్డెన్‌కి గంగ చరిత్రంతా తెలుసు. ఏ పరిస్థితులలో గంగ తన కొడుకును వేరొకరికిచ్చింది, ఆ తరువాత గంగ అనుభవించిన మానసిక వ్యధ అంతా తెలుసు. తాను చేసిన తప్పిదానికి ప్రాయశ్చిత్తంగా అనాథపిల్లల లాలనలో ఎలా స్వాంతన పొందుతున్నదీ తెలుసు. ఈ వివరాలన్నింటినీ వార్డెన్ అంతకు ముందే ఆ పై అధికారికి తెలియజేశాడు.

రెండు రోజుల క్రితం ఆశ్రమంలో జరిగిన సంఘటన గుర్తు చేసుకున్నాడు వార్డెన్.

"రేయ్ ఎల్లుండి మదర్స్ డే అట. మనం అమ్మమీద పూలు చల్లి కాళ్ళకు నమస్కరిద్దాం" అన్నాడు విజయ్ అనే ఎనిమిదేళ్ళ కుర్రవాడు మిగతా పిల్లలతో.

"నేను పెద్దయితే అమ్మను నా దగ్గరే ఉంచుకొని అమ్మకు ఇన్ని డబ్బులిస్తాను" అన్నాడు ఇంకో పిల్లవాడు. అమ్మ నా దగ్గర ఉంటుంది అంటే అమ్మ నా దగ్గర ఉంటుంది అని వాదులాడుకోసాగారు. ఇదంతా విన్న వార్డెన్ ఆ రోజే నిర్ణయించుకున్నాడు గంగకు సన్మానం చేయాలని. ఆ విషయమే పై అధికారిలో చెప్పి ఒప్పించాడు.

పిల్లలందరూ అమ్మా లేమ్మా రా అంటూ చేతులు పట్టుకుని గంగను వేదికపైకి తీసుకుపోయారు.

"చాలామంది తమ కడుపున పుట్టిన పిల్లలకు మాత్రమే మాతృప్రేమను పంచుతారు. కానీ తనకు ఏమీ కాని ఇంతమంది పిల్లలకు ఎలాంటి తారతమ్యం లేకుండా తన ప్రేమను పంచుతున్న మాతృమూర్తి ఈ గంగ. ఈ సన్మానానికి గంగ పూర్తిగా అర్హురాలు". అధికారి ప్రసంగం సాగుతోంది.

పిల్లలందరూ గంగ మీద పూలు జల్లి కాళ్ళకు నమస్కరిస్తున్నారు. గంగ కళ్ళ వెంట నీళ్ళు. అవి కొడుకును వదిలిపెట్టినందుకు వచ్చిన కన్నీళ్ళో ఇంతమంది పిల్లల అభిమానాన్ని సంపాదించుకున్నందుకు ఆనందబాష్పాలో గంగకే అర్థం కావడం లేదు.

ప్రసంగం పూర్తయింది. అందరూ చప్పట్లు కొట్టడం మొదలుపెట్టారు. గంగను శాలువాతో సత్కరించాడు అధికారి. విలేకరులు ఫోటోస్ తీయటం మొదలుపెట్టారు. రేపు పేపర్లలో తన గురించి గొప్పగా రాస్తారు. ఫోటో కూడా ప్రచురిస్తారు. ఇదివరకటిలా కాకుండా ఇతరులు తనకు కొంచెమైనా గౌరవం ఇస్తారు. కానీ ఇవేవీ గంగకు సంతోషం కలిగించటం లేదు. పైగా బాధ కలుగుతోంది. గంగలోని అమ్మ మనసు మాత్రం ఇక్కడ లేదు. శరీరానికే సన్మానం జరుగుతుంది. అమ్మ మనసు మాత్రం ఒప్పుకోవటం లేదు. ✻

## అవినీతికి నిర్వచనం

భిన్నత్వంలో ఏకత్వానికి పేరుగాంచిన ఆ దేశానికి ఓ విదేశీయుడు విలాసయాత్రలకని వచ్చాడు. ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ మొదలు అతనికి అన్ని రాష్ట్రాలలోనూ అనుభవాలు ఎదురవసాగాయి. అసలు ఖర్చులతోబాటు కొసరు ఖర్చులు కూడా చాలాచోట్ల ఇచ్చుకోవలసి వచ్చింది.



సుందర దృశ్యాలకు ప్రసిద్ధిగాంచిన ఓ రాష్ట్రంలోని ఓ పట్టణాన్ని అతను దర్శించాడు. ఓ రోజు మధ్యాహ్నం ఆ యాత్రికుడు తాను బసచేసిన వసతి గృహం వదలి, దగ్గర్లోనే ఉన్న కొన్ని ప్రాంతాల్ని చూద్దానికి కాలినడకన బయలుదేరాడు. ఎండ తీవ్రత భరించలేక ఓ చెట్టు నీడను చేరాడు. అక్కడ ఓ వ్యక్తి కర్రపట్టుకొని రోడ్డు పక్కగా ఎండలో నిలబడి కనబడ్డాడు. అతనితో పరిచయం చేసుకునే ఉద్దేశంతో "ఎండలో నిలబడి ఉన్నారు. యిలా వచ్చి చెట్టు నీడలో నిల్చోవచ్చు కదా?" అన్నాడు. దానికా వ్యక్తి "నిల్చోడానికేమీ అభ్యంతరం లేదు కానీ, చెట్టు నీడకి వచ్చి నిల్చుంటే ఏమిస్తారు?" అని అడిగాడు.

"ఈ దేశంలో నిజంగానే భిన్నత్వంలో ఏకత్వం ఉందను" కున్నాడా యాత్రికుడు. – ఎలక్ట్రాన్